ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.15, నల్లవంకాయ 31, పొడుగు వంకాయ 25, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 60, పచ్చికాకర 38, పందిరి బీర 58, క్యాబేజీ 19, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 48, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 23, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 28, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ డైసీ



ప్రొఫెసర్ డైసీకి అభినందనలు తెలుపుతున్న అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎస్సీ, ఎస్టీ సెల్ నూతన డైరెక్టర్‌గా తొలిసారి మహిళా ప్రొఫెసర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్ట్స్ కాలేజీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డైసీని డైరెక్టర్‌గా నియమిస్తూ వీసీ ప్రొ.కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.డైసీకి పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డా.దుబ్బ రంజిత్, డా.ముత్యాలయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని శ్రీ గణపతి దేవాలయంలో బుధవారం ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని ఈఓ సత్యనారాయణ తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

బీఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలు అనైతికం

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌పై బీఆర్‌ఎస్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల లింగం గౌడ్ అన్నారు. దొర మోచేతి నీళ్లకు అలవాటు పడిన వారు తెలంగాణ రాష్ట్రానికి ఒక బీసీ పీసీసీ అధ్యక్షుడైతే ఓర్వలేక పోతున్నారన్నారు. మహేష్‌కుమార్ గౌడ్‌ను చులనకగా మాట్లాడితే సహించేది లేదన్నారు.

తార్నాక జంక్షన్ పనుల పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక జంక్షన్(సిగ్నల్) పునరుద్ధరణ పనులను మంగళవారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ వాహనదారుల సౌకర్యార్థం చేపట్టిన పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జనవరిలోగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. దాదాపు 8 ఏళ్ల క్రితం మూసి వేసిన జంక్షన్‌ను తిరిగి ఓపెన్ చేయడం ద్వారా వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు పేరరాజు, వేణు, తార్నాక వాసులు డా పి. మోహన్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ఓయూ పీఎస్ ఎస్సై నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

రాంగోపాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పద్మశాలీలు హాజరయ్యారు. రెండు నెలల క్రితం జరిగిన ఎన్నికల్లో రాజ్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ నామాల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమ నిర్వహించారు. ఆయనతో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలోని పద్మశాలీల సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, గోవర్ధన్, నర్సయ్య, రమేష్, రంగయ్య, శ్రీనివాస్, బుర్రా మల్లేశం, వేముల బాల్‌రాజ్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగూడకు 'ఆధ్యాత్మిక' శోభ

- కొనసాగుతున్న మాలధారణలు, ఇరుముళ్లు
- కేరళీయుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు
- నిత్యాన్నదానాలు, అల్పాహార కేంద్రాలు
- స్వాముల రాత్రి బసకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఇదీ అయ్యప్ప ఆలయ ప్రత్యేకత



అయ్యప్ప దేవాలయంలో మండల పూజలు ప్రారంభించిన అర్చకులు



కొనసాగుతున్న మాలధారణలు

సికింద్రాబాద్: కార్తీకపౌర్ణమి మొదలు మకర సంక్రాంతి వరకు మెట్టుగూడలో ఆధ్యాత్మిక సందడి నెలకొంటుంది. నగరంతోపాటు, పలు జిల్లాల నుంచే వచ్చే భక్తులతో మెట్టుగూడలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం కిటకిటలాడుతుంది. మాల ధారణలు, ప్రత్యేక పూజలు, అన్నదానాలు, అల్పాహార విందులు, భజనలు, అయ్యప్ప శరణుఘోషలతో ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది.

- కేరళలోని శబరిమల అయ్యప్ప దేవాలయ అర్చకుల సంతతికి చెందిన వారే ఇక్కడ అర్చకులుగా కొనసాగుతుండడం ఈ ఆలయ ప్రత్యేకత. ఆలయ ప్రాగణంలో ఈనెల 17 నుంచి ప్రధాన అర్చకుడు కృష్ణప్రసాద్, సంయుక్త కార్యదర్శి సదాశివన్ నేతృతంలో మండల పూజలు ప్రారంభ మయ్యాయి. జనవరి 14న మకర సంక్రాంతి వరకు ఆలయంలో అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఇరుముళ్లకు ప్రసిద్ధి

మెట్టుగూడ అయ్యప్ప దేవాలయంలో మాలధారణలు చేసుకునేందుకు, శబరిమలకు బయలుదేరే సమయంలో ఇరుముళ్లు కట్టుకునేందుకు వేలసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఏటా సుమారు 20 వేల మంది మలాధారణలు చేసుకుంటుండగా, రెట్టింపు సంఖ్యలోని భక్తులు ఇరుముళ్లు కట్టించుకుని శబరిమల యాత్రకు బయలుదేరుతున్నారు.

- నగరంలో స్థిరపడిన కేరళీయుల నేతృత్వంలో 1980లో ఆవిర్భవించిన మెట్టుగూడ అయ్యప్ప స్వామి దేవాలయం దినదినాభివృద్ధి చెందుతోంది. శబరిమల అర్చకుల సంతతికి చెందిన అర్చకుటే ఇక్కడ నిత్య పూజలు చేస్తుండడం ఈ ఆలయ ప్రత్యేకత.
- ఈనెల 26న ఆలయంలో మహామండల పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక సభ్యుడు సునీల్‌కుమార్, గురుస్వామి వంశీకృష్ణ తెలిపారు. అదే రోజు చిలకలగూడ నుంచి మెట్టుగూడ అయ్యప్ప ఆలయం వరకు అయ్యప్ప స్వామిని అంబారీపై ఊరేగిసూ భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

ఉచిత భోజనం... బస..

ఆలయంలో మండల పూజల ప్రారంభం రోజు నుంచే అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం, రాత్రి అల్పాహారాన్ని అందించే సేవలు ప్రారంభమయ్యాయి. నిత్యం 500 మందికి పైగా అయ్యప్ప స్వాములకు భిక్ష, అల్పాహారం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. 41 రోజుల పాటు ఈ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు వారు పేర్కొన్నారు. రోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు భోజనం, రాత్రి 9.30 నుంచి 11 గంటల వరకు అల్పాహారాన్ని అందిస్తున్నారు. ఇంటిలో వసతి లేని అయ్యప్ప స్వాములు ఆలయం ప్రాగణంలో రాత్రి బస చేసేందుకు విశాలమైన హాల్‌ను అందుబాటులో ఉంచారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



గొల్లకొమురయ్య కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి, సనత్‌నగర్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిర్దిష్టమైన కార్యక్రమాలు, కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీలో స్థానిక కార్పొరేటర్ హేమలత, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ ముందు రోడ్డులో ప్రమాదాల నివారణకు స్పీడ్‌బ్రేకర్లు వేయాలని, కమ్యూనిటీహాల్ అదనపు అంతస్తు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, స్థానికంగా ఉన్న బోర్‌కు మరమ్మతులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులను సూచించారు. బోయిగూడ రైల్వే బ్రిడ్జి నుంచి బోలక్‌పూర్ మల్లన్న దేవాలయం వరకు ఉన్న రోడ్డును అందంగా తీర్చి దిద్ది ప్రజల ఇబ్బందులను దూరం చేశామన్నారు. కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని ఏఈని ఆదేశించారు. అనంతరం ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న బస్తీ నాయకుడు భాగ్యాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, జలమండలి డీజీఎం ఆశీష్, స్థానిక బస్తీ నాయకులు నర్సింగ్‌రావు, వినోద్, కె. రాజు, మనీష్, బీఆర్‌ఎస్ నాయకులు వెంకటేశన్, లక్ష్మీపతి, వెంకటరమణ, కుమార్ యాదవ్, గజ్జెల శ్రీనివాస్, వినోద్, వెంకట్, రాజేందర్, దేశపాక శ్రీనివాస్, రాపాక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు అందరివాడు



రాంగోపాల్‌పేట్: ఏసు క్రీస్తు సర్వమానవాళి కోసం ఈ లోకానికి వచ్చారని అందుకే క్రిస్మస్ ప్రపంచం మొత్తానికి గొప్ప పర్వదినమని ప్రముఖ సువార్తికురాలు విమలారెడ్డి అన్నారు. సికింద్రాబాద్ వైఎంసీఏలో ఐ నీడ్ హెల్ప్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెక్స్‌వర్కర్లు, గే, ట్రాన్స్ జెండర్లతో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చీరలు, కేక్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏసు క్రీస్తును మన హృదయంలోకి ఆహ్వానిస్తే మనకు ఏదీ కొదవ ఉండదని అన్నారు. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకురాలు జాయ్ చెరియన్ మాట్లాడుతూ లోక మంతా మనల్ని దూరం చేసినా ఏసు క్రీస్తు మాత్రం తన ప్రేమతో ప్రతి ఒక్కరిని తన వద్దకు ఆహ్వానిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డేనియల్, ట్రస్టు వ్యవస్థాపకుడు జాకబ్ చిన్నప్ప, జెస్సీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సందడిగా రైల్వే పెన్షనర్స్‌డే వేడుకలు



చిలకలగూడ: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిలకలగూడ కార్యాలయంలో రైల్వే విశ్రాంత ఉద్యోగుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల హక్కుల సాధనకు పోరాడిన డీఎస్ నకరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్ష , కార్యదర్శులు వరప్రసాదరెడ్డి, జీవీఎస్ రాయుడు మాట్లాడుతూ 1982 డిసెంబరు 17న విశ్రాంత ఉద్యోగులకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినందున1983 నుంచి పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెన్షనర్స్ తరఫున పోరాడి విజయం సాధించిన స్వర్గీయ డీఎస్ నకరే అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తి దాయకమన్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాలు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో కేవీపీ నాయర్, పీజేఎంరెడ్డి, మధుసూదన్‌రావు, ముత్యాలు, సాంబమూర్తి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహీంద్రా స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ యాజులు మెదూరి

సనత్‌నగర్: మహీంద్రా యూనివర్సిటీ నూతనంగా స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించింది. కలినరీ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో బీఎస్సీ (హానర్స్) కోర్సును అందుబాటులోకి తీసుకువచ్చింది. మంగళవారం బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మెడూరి, స్కూల్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ డీన్ కే తిరుజ్ఞాన సంబంతం మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీపై పట్టు సాధించేందుకు యూనివర్సిటీ కృషి చేస్తుందన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులో 60 సీట్లతో మొదటి బ్యాచ్‌ను 2025 ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జనవరిలో అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. 80 శాతం మార్కులతో ఏదేని బోర్డు నుంచి 10ప్లస్2 తర్వాత విద్యార్థులు ఈ కోర్సులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులుగా పేర్కొన్నారు. ఎన్‌సీహెచ్‌ఎంసీటీ, జేఈఈ ప్రవేశ పరీక్ష స్కోర్ ద్వారా లేదా మహీంద్రా యూనివర్సిటీ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్-2025లో అర్హత సాధించడం ద్వారా ప్రవేశాలను పొందవచ్చన్నారు.

మాజీ ఎమ్మెల్యే జయసుధకు జన్మదిన శుభాకాంక్షలు



లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే, సినీనటి జయసుధను మంగళవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జయసుధ నేతల సమక్షంలో బర్త్ డే కేక్ కట్ చేశారు.

ఉన్ని దుప్పట్ల పంపిణీ

సనత్‌నగర్: మోడల్‌కాలనీ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో చలి బారి నుంచి కాపాడేందుకు నగరంలోని రోడ్ల పక్కన, బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లపై సేద దీరుతున్న అభాగ్యులు, నిరాశ్రయులతో ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలోని రోగులు, సహాయకులకు ఉలెన్ బ్లాంకెట్స్ (ఉన్ని దుప్పట్లు)ను అందజేశారు. గత మూడు రోజులుగా రాత్రి వేళల్లో నగర వ్యాప్తంగా తిరుగుతూ ఎక్కడైతే చలికి వణుకుతూ కనిపించిన వారికందరికీ దుప్పట్లను అందజేశారు. ట్రస్టీ బుచ్చిబాబు మాట్లాడుతూ మానవ సేవా సమితి నిరంతరం సేవా కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మానసిక చికిత్సాలయానికి వచ్చే రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. విపత్తుల సమయంలో బాధితులను ఆదుకునేందుకు మానవ సేవా సమితి ఎప్పుడూ ముందుంటుందన్నారు. రూ.80,000 విలువ చేసే దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఉన్ని దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

కృతజ్ఞతా సభకు మంత్రుల రాక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బుధవారం జరగనున్న కృతజ్ఞతా సభకు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నట్లు తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ నాయకులు బైరు నాగరాజు గౌడ్ మంగళవారం తెలిపారు. ఆర్ట్స్ కాలేజీ ఎదుట సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభకు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఓయూ ప్రొఫెసర్లు హాజరవుతారన్నారు. సభకు విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఏబీవీపీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న ఏబీవీపీ 43వ మహాసభలను విజయవంతం చేయాలని ఓయూ అధ్యక్షుడు చెలిమెల ధృహన్, కార్యదర్శి విశ అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగం, నిరుద్యోగ సమస్యలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. మహాసభలను పురస్కరించుకుని సామాజిక సేవకులకు అందజేసే జనమంచ్ నేత గౌరీశంకర్ యువ పురస్కారానికి ఈ నెల 18 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9490866833 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

చిలకలగూడ: ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేసి క్షమాపణ చెప్పాలని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ అన్నారు. బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో నిరసన కార్యక్రమాలు చేపట్టిన వారు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతన్నలను నిర్బంధించి, కేసులు నమోదు చేసి జైలులో పెట్టడమేగాక, అనారోగ్యానికి గురైన రైతుకు బేడీలు వేయడం కాంగ్రెస్ నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాజుసుందర్, శైలేందర్, జకీర్, సాయియాదవ్, సాగర్, సాయి, టీఆర్‌టీ శేఖర్, లలిత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

తుకారాం గేట్‌లో...

కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించడం దారుణమని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె తుకారాం గేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. రైతుల పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వారినే ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్యగౌడ్, మనోహర్, దాసరి శ్రీను, ఎల్లయ్య, మహ్మద్, ఇస్మాయిల్, అమర్, దేవయ్య, రామప్ప, శ్రీరామ్ నాయక్, వసంత, మహేశ్వరి, విజయ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు



తుకారాంగేట్‌లో..

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు

పద్మారావునగర్: ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు ఆటో యూనియన్ నేతలు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆటో డ్రైవర్లు పద్మారావునగర్‌లో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వెంకటేష్, శంకర్ యాదవ్, వేణు, బాబు తదితరులు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రూపాల్లో నిరసనలు చేపట్టినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓలా, ఉబర్, రాపిడో కంపెనీలకు అనుమతిచ్చి ఆటోడ్రైవర్ల కడుపుకొట్టిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఏటా రూ. 12వేలు ఇస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లల ఫీజులు కట్టలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు రాములు, కిషోర్, శ్రీనివాస్, లక్ష్మణ్, వీరస్వామి, సురేష్, రవి, లక్ష్మణ్, కృష్ణ, రాము తదితరులు పాల్గొన్నారు.


గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్



సికింద్రాబాద్: రైలులో గంజాయి తరలిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసిన రైల్వే పోలీసులు అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావెద్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్ర, సోలాపూర్ జిల్లాకు చెందిన రోహన్ రాజు ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. అతను ఒడిశా రాష్ట్రం, రాయఘడ్ జిల్లాలో గంజాయి కొనుగోలు చేసి సోలాపూర్‌కు తరలించి అధిక ధరలకు విక్రయించేవాడు. ఈ క్రమంలో శంకర్ ఫణిగ్రాగీ అనే వ్యక్తి నుంచి 12.24 కేజీల గంజాయి కొనుగోలు చేసి అబ్బా యాదవ్, శరత్ సహకారంతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో సోలాపూర్ తరలిస్తున్నాడు. మంగళవారం ఉదయం రైలు సికింద్రాబాద్‌రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం. 8 కి చేరుకుంది. అదే సమయంలో రైల్వే స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహిస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అనుమానాస్పదంగా కనిపించిన రోహన్ రాజు వద్దకు వెళ్లి అతడి ట్రావెల్ బ్యాగ్‌ను సోదా చేయగా 12.24 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడికి గంజాయి విక్రయించిన ఒడిశాకు చెందిన శంకర్, సోలాపూర్‌కు చెందిన అబ్బా యాదవ్, శరత్ పరారీలో ఉన్నట్లు రైల్వే డీఎస్పీ తెలిపారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు, కానిస్టేబుళ్లు గోవర్ధన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం





సంగీత, సిద్ధార్థ్ (ఫైల్)

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లీకొడుకు అదృశ్యమైన సంఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుకారాంగేట్‌లోని సుభాష్ విగ్రహం ప్రాంతానికి చెందిన సంగీత, తన కుమారుడు సిద్ధార్థ్‌తో కలిసి ఈ నెల 15న బాల్‌నగర్ ఐడీపీఎల్‌లోని తన సోదరి ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లింది. ఆ తర్వాత భర్తకు ఫోన్ చేసి తాను మళ్లీ ఇంటికి తిరిగిరానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. దీంతో ఆందోళనకు గురైన సుభాష్ వారి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.